క్లుప్తంగా

ఘనంగా భూలోకమాంబ పండగ



అన్న సమారాధన ప్రారంభించిన నాయకులు

పరవాడ: పరవాడ గ్రామంలో కొలువుదీరిన భూలోకమాంబ అమ్మవారి పండగను గ్రామ ప్రజలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పార్టీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు.

అప్పన్నను దర్శించుకున్న పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్



కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుంటున్న మస్తానయ్య

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ మస్తానయ్య దర్శించుకుని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు చేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

బాజీ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు

గోపాలపట్నం: బాజీ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ కూడలిలో ఒక వైపు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడి పరిస్థితిని గురువారం ట్రాఫిక్ ఏడీసీపీ జె.రాజీవ్‌కుమార్, సీఐ అశోక్‌కుమార్‌లు పర్యవేక్షించారు. ఒక వైపు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో నాలుగు రోడ్ల జంక్షన్‌లో సుసర్ల కాలనీ, పాతగోపాలపట్నం నుంచి వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరు గోపాలపట్నం శ్మశానవాటిక వద్ద ఉన్న కూడలిలో యూటర్న్ చేసుకుని ఎన్ఏడీ వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సుసర్ల కాలనీ నుంచి గోపాలపట్నం వెళ్లే వారు లక్ష్మీనగర్ మీదుగా వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. వాహన చోదకులకు ఇబ్బందులు కలగకుండాచర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బారికేడ్లు తొలగించాలి

బాజీ జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలని సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బి.వెంకటరావు ప్రకటనలో డిమాండ్ చేశారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న డాక్టర్ పద్మినీ దేవి

ఏయూక్యాంపస్: జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు గాయత్రి విద్యా పరిషత్ వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం బీచ్ రోడ్ లోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆస్పత్రి సీనియర్ వైద్యులు పద్మినీదేవి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజానికి పౌష్టికాహారం అవసరమన్నారు. ఆధునిక ఆహార అలవాట్లకు స్వస్తి చెప్పి సహజ ఉత్పత్తులు, రసాయనాలు లేని ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పలు నమూనాలను విద్యార్థులు తయారు చేయగా, ఆమె వీటిని పరిశీలించి ఉత్తమ నమూనాలకు బహుమతులు అందజేశారు. పాఠశాల స్థాయి నుంచి మంచి ఆహార అలవాట్లను కలిగి ఉండాలని సూచించారు. సమతుల ఆహారం తీసుకోవాల్సిన అవసరాన్ని పలు ఉదాహరణలో వివరించారు. శరీరంలో పౌష్టికాహార లోపం ఫలితంగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, వారి పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల డాక్టర్లు, పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పౌష్టికాహార వీడియోలు అందర్నీ ఆకర్షించాయి.



పెందుర్తి వెంకటాద్రిపై శ్రీకృష్ణుడి అలంకారంలో స్వామివారు



గోపికా కృష్ణులుగా చిన్నారులు

రాధేశ్యామ.. యదునందనా..

మోముపై చెదరని చిరునవ్వు.. చతురత, సమయస్ఫూర్తి, స్నేహితులపై ఆత్మీయత కలగలిసిన ముగ్ధ మనోహరుడు.. మురళీ గానంతో పశుపక్ష్యాదులను సైతం మైమరపింపజేసిన సమ్మోహనుడు.. ఆయుధం పట్టకున్నా యుద్ధం గెలవగల యోధుడు.. గీతోపదేశంతో జగద్గురువుగా నిలిచిన ఆచార్యుడు.. శ్రీ కృష్ణ భగవానుడు. ఆ బృందావన విహారి, యదు నందనుడి జన్మాష్టమి వేళ ఊరూవాడా సంబరాలు చేసుకున్నారు. చిన్నికృష్ణుడి పాద ముద్రలతో లోగిళ్లు బృందావనాలే అయ్యాయి. బాల గోపాలుడు .. బుల్లి గోపికల వేషధారణల్లో చిన్నారులు చూడ ముచ్చటగా కనిపించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, మహిళల కోలాటాలు, ఉట్టి సంబరాలతో అంతటా సందడి నెలకొంది.

- ఇంటింటా కొలువుదీరిన బృందావన విహారి
- రెండోరోజు వైభవంగా కృష్ణాష్టమి వేడుక

సింహాచలం: శ్రీ కృష్ణాష్టమిని గురువారం కనులపండువగా చేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో శ్రీకృష్ణుడి విగ్రహం చెంత అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. గోవులకు పసుపుకుంకుమలు సమర్పించి హారతులిచ్చారు. కృష్ణాష్టకం పఠించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి శ్రీకృష్ణుడిని, గోవులను దర్శించుకున్నారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ ఈ పూజల్లో పాల్గొన్నారు.

- 98వ వార్డు అప్పన్నపాలెంలో శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని వేదికపై కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. అప్పన్నపాలెం నిర్వాసితులు, భక్తులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా శనివారం ఉట్ల సంబరం నిర్వహించనున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి స్వామిని దర్శించుకున్నారు.





సాయినగర్‌లో చిన్ని కృష్ణుడి అలంకరణలో అనివిత్ అయాన్, అనిషిత్ అయాన్

- పెందుర్తి మండలం రాంపురం గ్రామంలోని కృష్ణాలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సతీసమేతంగా వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఎమ్మెల్యే ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నంరెడ్డి శ్రీరాములు, బాదిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- అడవివరంలోని చింతచెట్టు ఏరియాలో మురళీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ సంఘం ప్రతినిధులు పంచదార్ల సోమునాయుడు, రవియాదవ్, శీర కృష్ణ, పంచదార్ల శ్రీనివాసరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- పెందుర్తి వెంకటాద్రిపై స్వామి వారి ఉత్సవమూర్తిని శ్రీకృష్ణుడిగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో వేదికపై వేంజేపచేశారు. విశేషంగా పూజలు నిర్వహించారు. వెన్నని నైవేద్యంగా సమర్పించారు. కృష్ణాష్టకం పఠించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు ఆలయ ప్రధానార్చకుడు రామానుజం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



రాంపురంలోని శ్రీకృష్ణుడు ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ దంపతులు

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

పరవాడ: శ్రీ కృష్ణాష్టమిని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. గోపికా కృష్ణుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఉట్టి సంబరంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణమందిరంలో ..

సబ్బవరం: గోపాలనగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పాల్గొని పూజలు చేశారు. స్వామి సన్నిధిలో సాయంత్రం నిర్వహించిన ఉట్ల సంబరం, సాంస్కృతిక కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము, జిల్లా యాదవ సంఘం నాయకుడు బర్టికాన బాబూరావు, సబ్బవరం ఉపసర్పంచ్ మండల లక్ష్మణ, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పల్ల కృష్ణ తదితరులున్నారు. బ్రిడ్జిటైన్స్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో గోపికాకృష్ణుల వేషధారణల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు. కరస్పాండెంట్ ఎలీషా, ప్రిన్సిపాల్ పునీత పాల్గొన్నారు.



అప్పన్న దేవస్థానానికి చెందిన గోశాలలో శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



సబ్బవరంలోని బ్రిడ్జిటైన్స్ పాఠశాలలో రాధాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

స్నాతకోత్సవానికి ఏయూ ముస్తాబు



గ్రీన్ రూమ్‌ను సిద్ధం చేస్తున్న కార్మికులు

- 9న స్నాతకోత్సవం
- హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్



వేదిక ఎదురుగా సీటింగ్



సిద్ధమవుతున్న వేదిక

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం 87,88,89,90 సంయుక్త స్నాతకోత్సవం ఈ నెల 9వ తేదీన జరగనుంది. దాదాపు నాలుగేళ్ల తరువాత జరగనున్న ఈ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చాన్సలర్ హోదాలో హాజరవుతున్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై సుమారు మూడు గంటలకు పైగా స్నాతకోత్సవం జరగనుంది. స్నాతకోత్సవం నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు.

స్నాతకోత్సవంలో సుమారు 690 మంది డాక్టరేట్లు అందుకోనున్నారు. వీరితో పాటు బంగారు పతకాలు, ప్రైజ్‌లు సాధించిన వారు 600 మంది వరకు ఉన్నారు. దీనితో వేదికపై పట్టాలు, ప్రైజ్‌లు, మెడల్స్ తీసుకునే వారు 1,290 మందికి పైగా ఉంటారు. వీరితో పాటు వారి కుటుంబ సభ్యులు సైతం అదే సంఖ్యలో కార్యక్రమానికి హాజరవుతారు. అతిథులు, ఆహ్వానితులు కార్యక్రమంలో పాల్గొంటారు. దీనికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు.

కార్యక్రమం జరిగే స్నాతకోత్సవ మందిరాన్ని సరికొత్తగా తీర్చిదిద్దుతున్నారు. సభా వేదికతో పాటు గవర్నర్ కోసం ప్రత్యేకంగా ఒక గ్రీన్ రూంను సిద్ధం చేస్తున్నారు. గవర్నర్‌తో పాటు ఇతర అధికారలు ధరించే ప్రత్యేకమైన స్నాతకోత్సవ వస్త్రాలు ఇప్పటికే సిద్ధం చేశారు. వేదికపై రాష్ట్ర గవర్నర్, ఉపకులపతి, ముఖ్య అతిథి, గౌరవ డాక్టరేట్‌లు అందుకునే వారు ఆశీనులు కావడానికి ప్రత్యేకమైన కుర్చీలను సైతం సిద్ధం చేశారు. వీటిని కేవలం స్నాతకోత్సవ సమయంలో మాత్రమే వినియోగిస్తారు. ఇప్పటికే వీటికి సభావేదిక వద్దకు తీసుకువచ్చారు. సభావేదిక, ప్రాంగణంలో భారీ శీతలీకరణ యంత్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.

2500 మంది వీక్షణ

స్నాతకోత్సవ మందిరంలో జరిగే కార్యక్రమానికి దాదాపు 2500 మంది వరకు ప్రత్యక్షంగా వీక్షిస్తారు. దీనికి అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ అభ్యర్థికి ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కేటాయించి, ముందుగానే వారికి తెలియజేస్తారు. వారికి కేటాయించిన స్థానాలలో మాత్రమే వారు కూర్చోవాలి. అదే విధంగా డాక్టరేట్ తీసుకునే వారితో పాటు ఒకరిని అనుమతిస్తారు. వారికి వేరుగా సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి అనుగుణంగా ఇప్పటికే వేదిక ఎదురుగా సీటింగ్ ఏర్పాట్లను ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నానికి పూర్తిస్థాయిలో వేదికను సిద్ధం చేసే దిశగా సిబ్బంది పనిచేస్తున్నారు. సాయంత్రం స్నాతకోత్సవం మందిరాన్ని ఏయూ ఉన్నతాధికారులు సందర్శించి, పనులను పరిశీలిస్తారు.

స్నాతకోత్సవ మందిరం చుట్టూ సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే చుట్టూ ఉన్న రహదారులను మరమ్మతులు చేయడం, కొత్తవాటిని నిర్మించడం పూర్తి చేశారు. స్నాతకోత్సవ మందిరం వెనుక భాగంలో ఉన్న పిచ్చి మొక్కల తొలగించి, చెట్లకు ప్రూనింగ్ పనులు పూర్తిచేశారు. పారిశుధ్య సిబ్బంది ఎప్పటిప్పుడు వ్యర్థాలను తొలగించి, తరలిస్తున్నారు.

బాల కార్మికుడి గుర్తింపు

యజమానిపై కేసు నమోదు

సబ్బవరం: నిబంధనలకు విరుద్ధంగా బాల కార్మికుడితో పని చేస్తున్న దుకాణ యజమానిపై కేసు నమోదు చేశారు. వివరాలివి..

సబ్బవరం మూడు రోడ్ల కూడలిలోని హర్యానా స్వీట్ షాపులో 14 సంవత్సరాల లోపు బాల కార్మికుడితో పని చేయిస్తున్నట్లు సహాయ కార్మిక అధికారి పి.సూర్యనారాయణ గురువారం గుర్తించారు. షాపు యజమాని ముఖేష్‌పై కేసు నమోదు చేశారు. సబ్బవరం మండలంలోని పలు షాపుల్లోనూ ఆయన తనిఖీలు నిర్వహించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు బాలబాలికలను ఎవరూ పనిలో పెట్టుకోరాదని స్పష్టం చేశారు. దానిని ఎవరైనా అతిక్రమిస్తే ఆ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో సీడ్స్ తరఫున జి.జగదేశ్వరి పాల్గొన్నారు.

సింహగిరీశుడికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణపుష్పార్చన నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరీశుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన నేత్రపర్వంగా జరిపించారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడామండపంలోని వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం కనులపండువగా జరిపించారు. ఆలయ కల్యాణమండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ వెంకటరావు

పరవాడ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలకు హాజరవుతున్న స్థానిక బాలుర జెడ్పీ పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు స్టడీ మెటీరియల్ సమకూర్చారు. ఆ మెటీరియల్‌ను హెచ్ఎం బి.అప్పలనాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. స్టడీ మెటీరియల్‌ను సమకూర్చిన ట్రస్ట్ ప్రతినిధులకు హెచ్ఎం అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎ.రామస్వామి, జూరెడ్డి దిలీప్, ఉపాధ్యాయులు గోవిందు, టి.వి.సత్యనారాయణ, సీటర్‌పాల్, మంజుల, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జేబుదొంగలు



పోలీసుల అదుపులో జేబుదొంగ

సింహాచలం : బస్సులో ప్రయాణికుడి పర్సు దొంగిలించి పారిపోతున్న ఇద్దరిని పెందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో నగరం నుంచి పెందుర్తి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో కంచరపాలేనికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఎన్ఏడీలో బస్సు ఎక్కారు. పెందుర్తి వైపు వెళ్తున్న ప్రయాణికుడి జేబులో ఉన్న పర్సు దొంగిలించి నాయడుతోట వద్ద బస్సు దిగేందుకు యత్నించారు. విషయం గుర్తించిన ప్రయాణికుడు ఇద్దరిలో కిరణ్ అనే వ్యక్తిని పట్టుకోగా.. రెండో వ్యక్తి మణికంఠ బస్సు దిగి పారిపోయాడు. బస్సులో ఉన్న ఇతర ప్రయాణికులు కేకలు వేయడంతో నాయుడుతోటలో విధులు నిర్వర్తిస్తున్న పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్, హోంగార్డు జనార్దన్ వెంబడించి పట్టుకున్నారు. పర్సులో రూ. ఇరవై వేలు ఉన్నాయి. ప్రయాణికుడు ఏటీఎంలో నగదు డ్రా చేసినప్పటి నుంచి అతన్ని వెంబడిస్తూ అతనితో పాటే వారు బస్సు ఎక్కినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఇద్దరిని ట్రాఫిక్ ఎస్ఐ క్రైమ్ పోలీసులకు అప్పజెప్పారు.

పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలి



పి.బోనంగిలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావు

పరవాడ : పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవడానికి రైతులు ముందుకు రావాలని అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు పిలుపునిచ్చారు. మండలంలో ఈ క్రాప్ జియో కోఆర్డినేట్‌లో 'వై' వచ్చిన పి.బోనంగి, కలపాక, స్వయంభూవరం, పీఎస్ బోనంగి గ్రామాలను గురువారం సందర్శించి ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడుతూ పండించిన పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోని పక్షంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి చేకూరదని చెప్పారు. పంట నమోదే అర్హతగా పేర్కొన్నారు. కలపాక ఆర్‌బీకేలో ఎరువుల నిల్వలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్వయంభూవరంలో అమలవుతున్న పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి, ఏఈవో సంజీవరావు, కలపాక వ్యవసాయ సహాయకురాలు హెచ్. అనిత ఉన్నారు.

కనులపండువగా శ్రీ కృష్ణుడి విగ్రహ ప్రతిష్ట



కొలువుదీరిన శ్రీ కృష్ణుడు



గొల్లపేటలో శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: నాయుడుపాలెం శివారు గొల్లపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ కృష్ణుడి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం గురువారం ఉదయం 11 గంటలకు కనులపండువగా జరిగింది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు. పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పరవాడ సర్పంచ్ ఎస్.అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు స్వామిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్.నేస్తాలు, ఎస్.సోమినాయుడు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.